సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



దీపాలంకరణ పోటీలు

రామగిరి: సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు సోమవారం దీపాలంకరణ పోటీలు నిర్వహించారు.



ఆకట్టుకున్న ఆటలు

గోదావరిఖని: సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్జీ–1 లేడీస్ క్లబ్ సభ్యులు ఇల్లెందు క్లబ్‌లో సోమవారం నిర్వహించిన ఆటల పోటీలు ఆకట్టుకున్నాయి.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పొడి వాతావరణం ఏర్పడుతుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

23న 'ముక్కోటి' పూజలు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు శ్రీరంగం నర్సింహాచార్యులు, విజయభాస్కరాచార్యులు, సంపత్‌కుమారాచార్యులు సోమవారం తెలిపారు. ఈనెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా క్షీరాభిషేకం, లక్షతులసీ అర్చన, వైకుంఠద్వార దర్శనం నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా జనవరి 14న గోదారంగనాయక స్వామి కల్యాణం జరిపిస్తామన్నారు. అప్పటివరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు భారీసంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

కొత్త గనుల ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: కొత్త భూ గర్భగనులు తవ్వించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుతామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు. ఓసీపీ–3 కృషిభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో బొగ్గు ఆధారిత సిమెంట్ కర్మాగారాలు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య తీర్చుతామన్నారు. సీసీఆర్ సింగరేణి సంస్థను అప్పుల పాలు చేసి బొందల గడ్డగా మార్చారని, తాను ప్రైవేటుపరం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల సొంతింటి కల నిజం చేస్తామన్నారు. సింగరేణి పనితీరుపై ఇప్పటికే సీఎం అధికారులతో సమీక్షిస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకులు బదావత్ శంకర్‌నాయక్, సత్యనారాయణరెడ్డి, అక్బర్‌అలీ, మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, గుండేటి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పునరుద్ధరించాలని దీక్ష



దీక్ష చేస్తున్న నాయకులు

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియా జీడీకే–11గని రోడ్డు పునరుద్ధరించాలని కార్మిక సంఘాల నాయకులు సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. కొత్త రోడ్డుతో కార్మికులు ప్రమాదాల బారినపడుతున్నారని తెలిపారు. డిసెంబర్ 11న పాతరోడ్డు ప్రారంభిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. పాత రోడ్డు పునరుద్ధరించే వరకూ దీక్ష కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, బీఎంఎస్, సీఐటీయూ, హెచ్ఎంఎస్, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శులు ఎం.సంపత్, పృథ్వీ, భాస్కర్, శ్రీనివాస్, కుమార్, శంకర్ పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో మేలు

జ్యోతినగర్(రామగుండం): పశువులకు కృత్రిమ గర్భధారణతో మేలుజాతి పాడి పశువులను వృద్ధి చేసుకోవచ్చని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామస్వామి, రామగుండం డాక్టర్ శ్రవణ్ కుమార్ అన్నారు. సోమవారం రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లి రైతువేదికలో పశుగణాభివృద్ధి సంస్థ చేపట్టిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉచిత పశు వైద్యశిబిరంలో వారు మాట్లాడారు. కృత్రిమ గర్భధారణలో వినియోగించే వీర్యానికి మార్కెట్‌లో రూ.600 ఉండగా రైతులకు రాయితీ పోనూ రూ.250కే అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ రాఘవ, స్థానిక గోపాల మిత్ర రఘు, పాడిరైతులు పాల్గొన్నారు.

బాలల హక్కులు పరిరక్షిస్తాం

రామగిరి(మంథని): బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని మహిళా సాధికారిత కోఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం బాలల హక్కులు, బాలికల విద్య ప్రాముఖ్యత, పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలబాలికలకు సమస్యలు ఉంటే 1098, 181, 14567 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మంజుల, ప్రతినిధులు జె.సుచరిత, డి.స్వప్న, ఎస్.సంధ్య, బి.పద్మ, జి.కవిత, ఎ.శ్రీలత, ఏఎన్ఎం స్వప్న పాల్గొన్నారు.

పత్తి ధర రూ.6,591



పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం పత్తి క్వింటాలు ధర గరిష్టంగా రూ.6,591 పలికింది. కనిష్టంగా రూ.5, 811 గా, సరాసరిగా రూ.6,488గా నిర్ణయించినట్లు ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

బస్టాండే ఆశ్రయం



గోదావరిఖని బస్టాండ్‌లో కుర్చీల కింద కునుకుతీస్తున్న వీరిద్దరూ తల్లీకూతుళ్లు. స్వగ్రామం పెద్దంపేట. కొంతకాలంగా ఇక్కడే సేదదీరుతున్నారు. దీనికి సమీపంలోనే నైట్‌షెల్టర్ ఉంది. అందులో సౌకర్యాలు లేక ఆశ్రయం తీసుకోవడానికి భయపడుతున్నారు. ప్రస్తుతం చలితీవ్రతతో నిద్ర రావడంలేదని ఆవేదన చెందుతున్నారు.

- ఫుట్‌పాత్‌లపైనా నిద్రపోతున్న వైనం
- నిరుపయోగంగా నైట్‌షెల్టర్లు
- చలికి వణుకుతున్న నిరాశ్రయులు
- 'సాక్షి' విజిట్‌లో వెలుగులోకి..

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరవాసులు రాత్రివేళ గాఢనిద్రలో ఉంటే.. కొందరు నిరాశ్రయులు ఎముకలు కొరికే చలిలో నరకం చవిచూస్తున్నారు. రహదారుల వెంట, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, ఆలయ ఆవరణలు, ఫుట్‌పాత్‌లపై సేదదీరుతూ, రాత్రివేళ అక్కడే నిద్రపోతున్నారు. పొట్టి, చిరిగిన, పల్చటి దుప్పట్లు కప్పుకుని సగం నిద్రతో సరిపెట్టుకుంటున్నారు. ఇందులో కూలీ పనులు ముగించుకుని, ఇతరత్రా పనులు పూర్తిచేసుకుని, బస్సులు మిస్ అయి, భిక్షాటన చేసేవారు, దిక్కులేనివారు నగరంలో చాలామంది ఉన్నారు. ఇలాంటి వారికి ఆశ్రయం కల్పించాలనే సదాశయంతో ఏర్పాటు చేసిన నైట్‌షెల్టర్లు ఎవరూ వసతి పొందలేక వెలవెలబోతున్నాయి. రాత్రివేళ 'సాక్షి' రామగుండం నగరంలో విజిట్ చేయగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి.



గోదావరిఖని రాంనగర్‌కు చెందిన ఈ వృద్ధురాలి పేరు లక్ష్మి. బస్టాండ్‌లో బ్లాంకెట్ కప్పుకొని వణుకుతూ కునుకు తీస్తోంది. గతంలో బస్సు ఢీకొనడంతో ఆమె కాలు విరిగింది. దెబ్బ తగిలిన చోట పుండు కావడంతో నొప్పి భరించలేకపోతోంది. మరోవైపు చలిలో గజగజ వణుకుతోంది. నైట్‌షెల్టర్‌లో ఒక్కదానినే పడుకోవడం భయంగా ఉందని చెబుతోంది.

> ### మూడేళ్లుగా ఫుట్‌పాత్‌పైనే..
>
> మాది మెట్‌పల్లి ప్రాంతం. ఉపాధి కోసం మూడేళ్ల క్రితం గోదావరిఖని వచ్చిన. ప్లాస్టిక్ కవర్లు ఏరుకుని, దుకాణాల్లో అమ్మి వచ్చే సొమ్ముతో ఆకలి తీర్చుకుంటున్న. నాకు ఇల్లు లేదు. పగలంతా ఎక్కడెక్కడో తిరిగినా రాత్రి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ముందు ఫుట్‌పాత్‌కు చేరుకుంటున్న. ఇక్కడే పండుకుంటున్న. వారం నుంచి చలి బాగా పెడుతంది. ఇబ్బందిగా ఉంది.
>
> – వేముల శేఖర్, గోదావరిఖని

నైట్‌షెల్టర్లు వెలవెల..

- నిరాశ్రయులకు రాత్రివేళ ఆశ్రయం కల్పించాలనే మంచిఉద్దేశంతో ఏర్పాటు చేసిన నైట్ షెల్టర్ల నిర్వహణపై రామగుండం నగరపాలక సంస్థ అధికారులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.
- ఫలితంగా నిరాశ్రయులకు రాత్రివేళ బస చేయడానికి చోటు లభించడంలేదు. ఎక్కడ ఖాళీ ప్రదేశం కనిపించినా అక్కడ సేదదీరుతూ చలిలో వణుకుతున్నారు.
- గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్, రామగుండం రైల్వేస్టేషన్ సమీప పాత తహసీల్దార్ కార్యాలయంలోని నైట్‌షెల్టర్లు వినియోగంలో ఉన్నాయి.
- ఒక్కో నైట్‌షెల్టర్‌లో 50 మంది వరకు ఆశ్రయం పొందవచ్చు.
- ఇందులో ఐదుగురికే భోజనం పెడతారు.
- కానీ శనివారం రాత్రి నైట్‌షెల్టర్‌లో ఒక్కరు కూడా బస చేసినట్లు కనిపించలేదు.



గోదావరిఖని బస్టాండ్‌లోని కుర్చీల కింద నిద్రపోతున్న ఈ దివ్యాంగుడి పేరు పాషా. మంచిర్యాల జిల్లా ఇందారం ప్రాంతవాసి. కాలు విరిగింది. కుటుంబసభ్యులు ఉన్నా.. ఇక్కడే సేదదీరుతున్నాడు. పగలంతా భిక్షాటన చేస్తున్నాడు. రాత్రి చలికి తట్టుకోలేక ఇలా ముసుగుపెట్టి కునుకు తీస్తున్నాడు.



గోదావరిఖని బస్టాండ్‌లో బ్లాంకెట్ కప్పుకొని చలికి వణుకుతున్న ఇతడి పేరు తిరుపతి. మంచిర్యాల జిల్లా శెట్టిపల్లి స్వగ్రామం. గోదావరిఖనిలో మేషన్ పనిచేస్తున్నాడు. పనులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు వచ్చేసరికి శెట్టిపెల్లి బస్సులు లేవు. ఆటో సౌకర్యం లేదు. దీంతో బ్లాంకెట్ కప్పుకొని చలిలో వణుకుతూ ఇలా కనిపించాడు.



ఈ వృద్ధుడి పేరు రాజయ్య. గొల్లపల్లి గ్రామవాసి. నా అనే వాళ్లు ఎవరూ లేక గోదావరిఖని బస్టాండ్ లోనే సుమారు పదేళ్లుగా తలదాచుకుంటున్నాడు. ప్రతీ చలికాలంలో చలికి వణుకుతూ అవస్థలు ఎదుర్కొంటున్నాడు.

ఫోన్ల వేటలో పోలీసులు భళా!

- సెల్‌ఫోన్ల రికవరీలో ఉమ్మడి జిల్లా పోలీసుల ప్రతిభ
- సత్ఫలితాలు ఇస్తున్న సీఈఐఆర్ విధానం
- ఏప్రిల్‌లో కరీంనగర్‌లోనే ప్రారంభించిన పోలీసుశాఖ
- ఇప్పటి వరకూ పోయిన ఫోన్లలో 50శాతం వరకు గుర్తింపు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించి తిరిగి అప్పగించడంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోలీసులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. సీఈఐఆర్ విధానం ఉపయోగించి ఫోన్లను గుర్తిస్తున్నారు. ప్రస్తుతం సెల్‌ఫోన్ విద్యార్థి నుంచి వృద్ధులు, అధికారి నుంచి కూలీవరకు, ఉన్నతాధికారి నుంచి చిరుద్యోగి వరకు, వార్డు మెంబరు నుంచి ప్రధాని వరకు అందరిని కలిపే సామాజిక మాధ్యమంగా మారింది. అలాంటి సెల్‌ఫోన్ పొరపాటున పోగొట్టుకున్నా.. చోరీకి గురైనా అందులోని డేటాతోపాటు, విలువైన సమాచారం పోతుంది. అందుకే పోలీసులు అలా పోగొట్టుకున్న ఫోన్లను వేటాడి గుర్తించేందుకు సీఈఐఆర్ విధానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ సాంకేతికతను తొలిసారిగా కరీంనగర్ కమిషనరేట్‌లో ప్రయోగపూర్వకంగా ప్రారంభించారు. ప్రస్తుతం 50శాతం వరకు ప్రజలు పోగొట్టుకున్న ఫోన్లను గుర్తించగలిగారు.

1318 ఫోన్ల అందజేత

ఈ ఏడాది ఏప్రిల్‌లో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ (సీఈఐఆర్) సాంకేతికతపై కరీంనగర్ కమిషనరేట్‌లో పోలీసులకు శిక్షణ ఇచ్చారు. ఆ వెంటనే రామగుండం, జగిత్యాల, సిరిసిల్ల జిల్లా సిబ్బందికి శిక్షణను విస్తరించారు. ఈ సాంకేతికత వినియోగంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకూ 5,449 ఫోన్లు ఉమ్మడి జిల్లాలో పోయినట్లు రిపోర్టయ్యాయి. అందులో 1318 ఫోన్లను రికవరీ చేశారు. సెల్‌ఫోన్ల రికవరీ అత్యధికంగా 418 రామగుండం పరిధిలో ఉండగా, అత్యల్పంగా 157 జగిత్యాల పరిధిలో ఉండటం గమనార్హం.

సీఈఐఆర్ సాంకేతికత అంటే.?

డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ (సీఈఐఆర్) సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా పోయిన సెల్‌ఫోన్‌ను తిరిగి కనిపెట్టొచ్చు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి సెల్‌ఫోన్‌ను ఐఎంఈఐ నంబరు సాయంతో బ్లాక్ చేయవచ్చు. ఈ తరువాత ఆ సెల్‌ఫోన్ ఎట్టి పరిస్థితుల్లోనూ పనిచేయదు. ఒకవేళ ఫోన్ ఆన్‌చేసినా, అందులో కొత్త సిమ్‌కార్డు వేసినా.. ఆ విషయం ఫోన్ యజమానికి ఎస్ఎంఎస్ ద్వారా తెలిసిపోతుంది.

ఎలా పనిచేస్తుంది..?



పోయిన ఫోన్‌ను అందజేస్తున్న చొప్పదండి సీఐ రవీందర్ (ఫైల్)

సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సీఈఐఆర్.జీవోవీ.ఐఎన్ పోర్టల్ ఓపెన్ చేయాలి. అందులో బ్లాక్ ఫోన్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి.

- అందులో మొబైల్ నంబర్–1, మొబైల్ నంబరు–2, సెల్‌ఫోన్ బ్రాండ్, మోడల్, ఇన్వాయిస్ (బిల్) ఫొటో సూచించిన గడుల్లో నింపాలి.
- పోగొట్టుకున్న స్థలం, పోయిన తేదీ, ఇతర చిరునామా, అంతకుముందే ఇచ్చిన పోలీస్ కంప్లయింట్ నంబరు, ఫోన్ యజమాని చిరునామా, ఈమెయిల్ ఐడీ, ధ్రువీకరణ కార్డులు, చప్టాలను సూచించిన బాక్సుల్లో నింపాలి. వెంటనే సెల్‌ఫోన్ (పాత నెంబరు మీద తీసుకున్న కొత్త సిమ్) నంబరుకు ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ ఎంటర్ చేసిన తరువాత ఫామ్‌ను సబ్మిట్ చేయాలి. ఆ తరువాత ఫోన్ దానంతట అదే బ్లాక్ అవుతుంది. ఇకపై దాన్ని ఎవరూ ఆపరేట్ చేయలేరు. అందులోని డేటా సురక్షితంగా ఉంటుంది. ఒకవేళ దొంగించిన వ్యక్తి లేదా సెకండ్ హ్యాండ్‌లో కొన్న వ్యక్తి సిమ్ వేయగానే.. మీ నంబరుకు మెసేజ్ వస్తుంది.

ఆ సందేశం ఆధారంగా ఫోన్ ఎక్కడ ఉన్నా.. పట్టుకోవడం సులభతరంగా మారుతుంది.

అన్‌బ్లాక్ చేయండిలా

- మీఫోన్‌ను పోలీసులు పట్టుకున్నా.. లేక మీకే దొరికినా.. మీ పాత ఐడీని, ఫోన్‌నంబరు, ఇతర వివరాలు నింపిన తరువాత ఫోన్‌ను అన్‌బ్లాక్ చేసుకోవచ్చు.

ఐఎంఈఐ నంబరు తెలియకపోతే?

పోగొట్టుకున్న ఫోన్ ఐఎంఈఐ నంబరు తెలియక పోయినా/ గుర్తులేకపోయినా మీ మొబైల్ నుంచి స్టార్ హాష్ జీరో సిక్స్ హాష్ డయల్ చేయగానే మీ మొబైల్ నంబరుపై దాని ఐఎంఈఐ నంబరు ప్రత్యక్షమవుతుంది.

- ఒకవేళ ఫోన్ పోగొట్టుకుంటే.. ఫోన్ కొన్న బాక్స్ మీద లేదా కొనుగోలు చేసిన షాప్‌లో ఉన్న ఇన్వాయిస్ (బిల్) ద్వారా ఐఎంఈఐ నంబరు సాధించవచ్చు.

> ### నేటికీ దొరకని 'బండి' ఫోన్
>
> ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు జరుగుతున్న సమయంలో వాట్సాప్‌లలో పేపర్ లీకేజీ కలకలం రేపింది. ఈ వ్యవహారంలో ఎంపీ బండి సంజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో బండి సంజయ్ ఫోన్ అదృశ్యమైంది. పోలీసులే తన ఫోన్ మాయం చేశారని ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. ఆయన ఫోన్‌తో తమకు సంబంధం లేదని పోలీసులు వివరణ ఇచ్చారు. ఆరోపణల పర్వం ఎలా ఉన్నా.. బండి సంజయ్ ఫోన్ నేటికీ లభించలేదు. అందులో అనేక కీలక విషయాలు ఉన్నాయని, తన ఫోన్ వెంటనే అప్పగించాలని బండి అనుచరులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా.. పోలీసుల తరపు నుంచి ఎలాంటి ప్రతిస్పందన రాకపోవడం గమనార్హం. ఫోన్ల రికవరీలో దేశంలోనే నంబర్‌వన్‌గా గుర్తింపు తెచ్చుకున్న తెలంగాణ పోలీసులు ఎంపీ సెల్‌ఫోన్ విషయంలో ఎలాంటి పురోగతి సాధించకపోవడంపై ఆయన అనచరులు విమర్శలు గుప్పిస్తున్నారు.

బ్లాక్‌చేయండిలా..

- ఒకవేళ మీరు సెకండ్ హ్యాండ్ లేదా ఓఎల్ఎక్స్ తదితర వెబ్‌సైట్స్ లేదా తెలిసిన వారి వద్ద ఫోన్ కొనుక్కోవాల్సి వచ్చినపుడు అది దొంగిలించిందా..? లేదా బ్లాక్‌లిస్టులో ఉందా? అన్న విషయం కేవైఎం (నో యువర్ మొబైల్) విధానంలో ముందే తెలుసుకోవచ్చు.
- ఇందుకోసం మొబైల్ తీసుకుని కేవైఎం (నో యువర్ మొబైల్) విధానంలోనూ ఐఎంఈఐ నంబరును తెలుసుకోవచ్చు. ఇందుకోసం కేవీఎం అని పెద్ద అక్షరాల్లో టైప్ చేయాలి. అనంతరం 15 అక్షరాల ఐఎంఈఐ నంబరును టైప్ చేసి 14422కు ఎస్ఎంఎస్ పంపాలి.
- ఇందుకోసం కేవైఎం యాప్‌ను సైతం డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇది ఆండ్రాయిడ్/ ఐఓఎస్ మొబైళ్ల ప్లేస్టోర్లలో అందుబాటులో ఉంది. లేదా సీఐఆర్ వెబ్‌పోర్టల్‌లో ఆఖరుగా ఇచ్చిన ఆప్షన్ ద్వారా సెల్‌ఫోన్ తనిఖీ చేసుకోవచ్చు.

పోలీసులు బ్లాక్ చేసి, అప్పగించిన ఫోన్ల వివరాలు

జిల్లా	బ్లాక్ చేసినవి	గుర్తించినవి	అప్పగించినవి
రామగుండం	1,813	888	418
కరీంనగర్	1,531	654	360
జగిత్యాల	1,030	447	157
రాజన్నసిరిసిల్ల	1,075	465	383
మొత్తం	5,449	2,454	1318

(నోట్: 20–04–2023 నుంచి 07–12–2023 వరకు)

సమస్యలున్నయ్.. పరిష్కరించండి

> - పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువత కోసం గ్రంథాలయంలో పుస్తకాలు అందుబాటులోకి తేవాలి.
>
> – మధుకర్, సామాజిక కార్యకర్త, కుక్కలగూడూరు, పాలకుర్తి

> - మా ఊళ్లోని కోళ్లఫామ్ నుంచి దుర్గంధం వస్తోంది. అందులో పనిచేస్తున్న సిబ్బంది అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలి.
>
> – ఆరెల్లి లింగయ్య, వెంకట్రావుపల్లి, జూలపల్లి

- ప్రజావాణి అధికారులకు అభాగ్యుల వేడుకోలు
- వినతులు స్వీకరించిన అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ
- భూ సంబంధిత సమస్యలపై తగ్గిన అర్జీలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన అభాగ్యులు తమ సమస్యలు పరిష్కరించాలని ఉన్నతాధికారులు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఆమెకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని స్వీకరించిన అరుణశ్రీ.. అర్జీలపై ప్రత్యేక దృష్టిసారించి సత్వరమే పరిష్కారంచూపాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కారమార్గాలు చూపడంలో అత్యంత ప్రాధాన్యతమివ్వాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. దరఖాస్తులపై తీసుకున్న చర్యలు, కారణాలు వివరిస్తూ అర్జీదారులకు సమాచారం అందించాలని సూచించారు.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

తగ్గిన దరఖాస్తుల సంఖ్య..

జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలపై ప్రజావాణి ద్వారా అధికారులకు అర్జీలు సమర్పించేవారు. ఇందులో ముఖ్యంగా ధరణి సమస్యలపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందేవి. కానీ, ఈసారి భూ సంబంధిత సమస్యలపై అర్జీలు తక్కువగా వచ్చాయని అధికారులు తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించడం, భూమాత పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తామని హామీ ఇవ్వడం ఇందుకు కారణాలు అయి ఉండొచ్చని భావిస్తున్నారు.

హక్కు కల్పించండి



నాకున్న 13.5 గుంటలను అటవీ అధికారులు మాది అని చెప్పిండ్రు. దానిపై విచారణ జరిపించిన అధికారులు.. అటవీశాఖది కాదని నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చిండ్రు. ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చింది. కానీ, ఆ భూమిని ఇతరులకు బదలాయించే హక్కు ఇవ్వలేదు. ఏళ్లుగా తిరుగుతున్నా పట్టించుకుంటలేరు. విచారణ జరిపి న్యాయం చేయాలి.

–చుక్క రాజయ్య, ఎక్లాస్‌పూర్, మంథని

పాసుపుస్తకం ఇత్తలేరు



పెద్దపల్లి ఇండియన్ బ్యాంకులో పట్టదార్‌పాసుబుక్కు ఉంచి రూ.14వేలు అప్పు(లోన్‌ఖాతా నంబరు 647085 4168) తీసుకున్న. అప్పు మొత్తం చెల్లించిన. లోను తీరినా పాసుపుస్తకం ఇవ్వడంలేదు. పట్టాదారు పాసుపుస్తకం ఇప్పించండి.

–భాస్కరి మల్లమ్మ, గొల్లపల్లి, కమాన్‌పూర్

ఫిర్యాదు ఇచ్చిన



పెద్దపల్లి శివారు రంగంపల్లిలో 1998లో 13గుంటలు కొని రిజిస్ట్రేషన్ చేసుకున్న. 2016 దాకా పహాణిలో కనిపించింది. ఆ తర్వాత దానిని కనిపించకుండా చేసిండ్రు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితంలేదు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్‌లోనూ ఫిర్యాదు చేశా. పాసుపుస్తకం అందించాలి.

–పులి కృష్ణారెడ్డి, కాల్వశ్రీరాంపూర్

ఇక పల్లెపల్లెకూ ఆర్టీసీ బస్సులు

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ఆర్టీసీ బస్సు సేవలపై సమీక్ష

మంథని: బస్సు సౌకర్యంలేని అన్ని గ్రామాలకు బస్సులు నడిపించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. ఇదేసమయంల విద్యార్థులకు అనుకూలంగా సర్వీసులు ఉండాలన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్టీసీ బస్సు సేవలపై సమీక్షించారు. బస్సుల్లో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గతంలో రోజూ 2.40లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారని, ఇప్పుడు చేస్తే 3.70లక్షల మంది ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. వరుస సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని, ఇందుకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని మంత్రి సూచించారు. 60శాతం వరకు మహిళల ఆక్యుపెన్సీ ఉందని కరీంనగర్ రీజినల్ మేనేజర్ సుచరిత తెలిపారు. అంతకుముందు మంత్రిని అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంలు ఎస్.భూపతిరెడ్డి, సత్యనారాయణ, మంథని డీఎం రాజశేఖరం తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందిస్తాం

ఏసుక్రీస్తు ఆశీస్సులతో ప్రజలకు సుపరిపాలన అందిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. క్యాంపు కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, సంఘం పెద్దలు, మహిళలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు


అంతకుముందు మంత్రి పలు ఆలయాల్లో పూజలు చేశారు.

బీఆర్ఎస్ యంత్రాంగా పనిచేసిన పోలీసు శాఖ


పోలీసు శాఖ బీఆర్ఎస్ యంత్రాంగంగా పనిచేసిందని, ఇప్పుడు ఏచిన్న సంఘటన జరిగినా పోలీసులే బాధ్యత వహించాలని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక పట్టణానికి చేరుకున్న మంత్రి ప్రధాన చౌరస్తాలో మాట్లాడారు. తన తండ్రి ఆశయ సాధన కోసం రాజకీయాల్లోకి వచ్చిన తనకు ప్రజలు ఐదుసార్లు పట్టం కట్టారని అన్నారు. తన పదవికి వన్నె తెచ్చేలా తన రాజకీయ ప్రయాణం ఉంటుందని చెప్పారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన అరాచకాలతో కాంగ్రెస్ శ్రేణులు అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. న్యాయవాది వామన్‌రావు, ఆయన సతీమణిని దారుణంగా చంపారని ఆరోపించారు. కాగా, మంథని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బొడ్డెల ఆనంద్, పలువురు బీఆర్ఎస్ నాయకులు మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జీలుగా పొన్నం, దుద్దిళ్ల

- నిజామాబాద్ లోక్‌సభకు జీవన్‌రెడ్డి
- లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా నియామకం




దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



టి.జీవన్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజక వర్గాలకు ఇన్‌చార్జీలుగా రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నిజామాబాద్ లోక్‌సభ ఇన్‌చార్జిగా పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిలను నియమిస్తూ కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది మార్చిలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా అత్యధిక ఎంపీ సీట్లను కైవసం చేసుకునే దిశగా పార్టీ అధిష్టానం కసరత్తును ప్రారంభించింది. శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించిన ఉత్సాహంతోనే పార్లమెంట్‌కు జరిగే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ధీటుగా ఎదుర్కొనేందుకు సీనియర్ నేతలను రంగంలోకి దించింది. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు నాయకులు దశాబ్దాలుగా పనిచేయడంతో పాటు క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు అందుబాటులో ఉండే పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డిలను నియమించడంతో లోక్‌సభ సమరానికి కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమవుతుందని చెప్పవచ్చు.



పూజలు చేస్తున్న మంత్రి పొన్నం దంపతులు

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన 'పొన్నం'

రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ సోమవారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. పదవీ బాధ్యతల స్వీకారానికి రాష్ట్ర మంత్రులతో పాటు సీనియర్ కాంగ్రెస్ నేతలు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై పొన్నం ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

బాలికా సాధికారతకు ఎన్టీపీసీ పెద్దపీట



కిట్లు అందిస్తున్న సీజీఎం కేదార్‌రంజన్

జ్యోతినగర్(రామగుండం): బాలికాసాధికారతకు ఎన్టీపీసీ పెద్దపీట వేస్తోందని ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజన్ పాండు అన్నారు. సోమవారం ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్‌లోని జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లో బాలికలకు రోహిణి ఫౌండేషన్ సహకారంతో డెంటల్ వైద్య శిబిరం ప్రారంభించారు. బాలికల అభ్యున్నతికి ఎన్టీపీసీ ఏటా జెమ్ కార్యక్రమం నిర్వహించి బాలికలకు అన్నిరంగాల్లో శిక్షణ అందిస్తోందన్నారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించచాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం(హెచ్‌ఆర్)బిజయ్‌కుమార్ సిగ్దర్, అధికారులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



మల్లికార్జునస్వామి

మంథని: మంథని మున్సిపల్ కమిషనర్‌గా గుట్టల మల్లికార్జునస్వామి సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేస్తున్న మల్లికార్జునస్వామిని మంథని మున్సిపల్ కమిషనర్‌గా నియమించిన విషయం తెలిసిందే.

అన్నపై దాడిచేసిన తమ్ముడి కేసు

గోదావరిఖని: అన్నపై దాడిచేసిన తమ్ముడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక ద్వారకానగర్‌కు చెందిన దాస సురేశ్‌పై రోకలిబండతో దాడిచేసిన తమ్ముడు దాస నరేశ్‌పై కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఆస్తి పంపకాల విషయంలో జరిగిన విభేదాలతో దాడి జరిగిందన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ వివరించారు.

సుగ్లాంపల్లిలో..

సుల్తానాబాద్‌రూరల్: సుగ్లాంపల్లికి చెందిన సుంకరి రాజేశంపై అతడి అన్న సుంకరి ప్రభాకర్, కొడుకు వెంకటేశ్ ఆదివారం రాత్రి దాడి చేశారని ఎస్సై విజేందర్ తెలిపారు. అన్నదమ్ముల మధ్య భూమి విషయంలో కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. రాజేశం తనఇంటి ఎదుట ఉండగా.. ప్రభాకర్, అతడి కొడుకు కర్రతో దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

టైంపాస్ మాటలు వద్దు

- అభివృద్ధి పనుల్లో జాప్యంపై రామగుండం ఎమ్మెల్యే ఆగ్రహం
- శరవేగంగా ప్రగతి పనులు చేపట్టాలని ఆదేశం
- నగరాభివృద్ధి కోసం మేయర్‌కు పూర్తిస్వేచ్ఛ ఇస్తాం
- కార్పొరేషన్ సమావేశంలో ఎంఎస్ రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీ(రామగుండం): 'అభివృద్ధి పనులు సకాలంలో ఎందుకు పూర్తిచేయలేదు? అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? టైంపాస్ మాటలు మంచివికావు.. ప్రగతి పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు' అని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. రామగుండం ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారి ఆయన కార్పొరేషన్‌లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై అన్ని శాఖల అధికారులతో సోమవారం సమీక్షించారు. అధికారుల నిర్లక్ష్యం, పనులు నత్తనడకలో సాగుతుండడం, నిధుల వినియోగం తదితర అంశాలపై వివరణ ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశించారు. హఠాత్పరిణామానికి అధికారులు హడలెత్తిపోయారు. తొలుత నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, అధికారులు కలిసి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

పనుల పురోగతిపై నిలదీత, ప్రశ్నల వర్షం..

- కార్పొరేషన్‌లో చేపట్టిన ప్రగతి పనుల గురించి అధికారులు వివరించగానే ఎమ్మెల్యే ఠాకూర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.
- ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఎక్కడినుంచో రాలేదని, రామగుండం నగరపాలక సంస్థ, ఇక్కడి అధికారులపై తనకు పూర్తిఅవగాహన ఉందన్నారు.
- అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యంపై ఒకదశలో ఎస్ఈ చిన్నారావు, అధికారులను ఎమ్మెల్యే నిలదీశారు.

ప్రాజెక్ట్ రిపోర్టు ఇవ్వండి..

- నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమగ్ర ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేయాలని ఎమ్మెల్యే ఠాకూర్ ఆదేశించారు.
- దీని ఆధారంగా సీఎంకు నివేదించి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.
- పారిశుద్ధ్య పనులు మెరుగు పర్చాలని చెప్పారు.
- లక్ష్మీనగర్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.
- సమ్మక్క–సారలమ్మ జాతర ఏర్పాట్లపై సన్నాహక సమావేశం ఏర్పాటు చేయాలన్నారు.
- ఈ సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, కొలిపాక సుజాత, ఎండీ ముస్తాఫా, శంకర్ నాయక్, బాల రాజ్‌కుమార్, పాతపెల్లి ఎల్లయ్య, ఎస్ఈ చిన్నారావు, ఈఈ సుచరణ్, డీఈ జమీల్, ఎగ్జామినర్ షేక్ ఖాజా, టీఎస్ఈడబ్ల్యూ, ఐడీసీ ఈఈ అనితాసింగ్‌నాథ్, డీఈఈ విన్సెంట్ రావు, ఆర్‌అండ్‌బీ డీఈ జాఫర్, ఈఈ జావీద్ తదితరులు పాల్గొన్నారు.

- డివిజన్లలో యూజీడీలు, రోడ్ల నిర్మించడానికి వెచ్చించాల్సిన నిధులతో ఇతర వృథా పనులకు ఎందుకు కేటాయించారని ప్రశ్నించారు.
- సమీకృత మార్కెట్ల భవనాల పనుల్లో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు.

మేయర్‌కు పూర్తిస్వేచ్ఛ ఇస్తాం..

సంపూర్ణంగా అభివృద్ధి చేసి అందమైన రామగుండం నగరంగా తీర్చిదిద్దడానికి అధికారులు పూర్తిసహకారం అందించాలని ఎమ్మెల్యే ఠాకూర్ కోరారు. నగరాభివృద్ధి కోసం మేయర్‌కు పూర్తిస్వేచ్ఛ ఇస్తామన్నారు. అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో పనులు పూర్తిచేసి ప్రభుత్వానికి, తమకు మంచిపేరు తేవాలని కోరారు. నగరాన్ని వాణిజ్య, పర్యాటక కేంద్రాలుగా, ఎడ్యుకేషన్, మెడికల్ హబ్‌గా రూపొందించడమే తన లక్ష్యమని ఆయన వెల్లడించారు. డీఎంఎఫ్‌టీ, 14వ, 15వ ఆర్థిక సంఘం, పట్టణ ప్రగతి, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ తదితర పనుల పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వాణిజ్యకేంద్రమైన లక్ష్మీనగర్‌లో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేయడంలో ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రమాదకర విద్యుత్ తీగలు సవరించి భూగర్భ లైన్ వేయాలని ఆదేశించారు. బిల్లులు తీసుకొని పనులు పూర్తిచేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ కారణాలతో ప్రారంభం కాని పనులను పునఃసమీక్షించాలని అన్నారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య

- అదనపు కట్నం తేవాలని హింసించిన అత్తామామ
- వివాహమైన రెండేళ్లకే నూరేళ్లు
- అనాథగా మారిన తొమ్మిదినెలల బాలుడు



మౌనిక (ఫైల్)



కొడుకుతో మౌనిక(ఫైల్)

పెద్దపల్లిరూరల్: అదనపు కట్నం తేవాలనే అత్తామామల వేధింపులు భరించలేక పెద్దపల్లి జిల్లా మన్మంతునిపేట గ్రామానికి చెందిన గోగుల మౌనిక ఉరఫ్ తీగల సాధన(25) సోమవారం వేకువజామున ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివాహమైన రెండేళ్లకే ఈ అఘాయిత్యానికి ఒడిగట్టడంతో ఆమె తొమ్మిది నెలల కుమారుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. ఎస్సై మల్లేశ్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన గోగుల మౌనిక ఉరఫ్ తీగల సాధనను రెండేళ్ల క్రితం పెద్దపల్లి మండలం హన్మంతునిపేటకు చెందిన తీగల రాజ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. ఆ సమయంలో రూ.7లక్షల నగదు, పల్సర్‌బైక్ కట్నంగా ఇచ్చినట్లు మౌనిక తల్లి గోగుల సమ్మక్క తెలిపారు. ఆ తర్వాత కూడా అదనంగా కట్నం తేవాలంటూ తమ కూతురును భర్త రాజ్‌కుమార్, అత్త, మామ యశోద, పోచాలు వేధించేవారని కన్నీటి పర్యంతమైంది. తరచూ కొంత మొత్తాన్ని వారికి ఇచ్చామన్నారు. మళ్లీ రూ.2లక్షలు తేవాలంటూ వేధించడంతో మౌనిక ఈనెల13న పుట్టింటికి వచ్చిందన్నారు. ఇటీవలే భర్తతో మాట్లాడించి మళ్లీ అత్తింటికి పంపించామని అన్నారు. ఈక్రమంలో సోమవారం వేకువజామున మౌనిక ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు భర్త రాజ్‌కుమార్, అత్త, మామలు యశోద, పోచాలుపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ మహేశ్ తెలిపారు.

ఆడుకుంటూనే ప్రాణాలు విడిచాడు

- అనారోగ్యంతో బాలుడి దుర్మరణం
- బతుకుదెరువు కోసం విదేశాలకు తండ్రి
- కొడుకు మరణంతో స్వగ్రామానికి



బాలుడి మృతదేహం

ధర్మపురి: ఆడుకుంటూనే ఓ బాలుడు ప్రాణాలు విడిచిన ఘటన ధర్మపురి మండలం నేరెళ్లలో విషాదం నింపింది. స్థానికుల కథనం ప్రకారం.. నేరెళ్ల గ్రామానికి చెందిన తోకల నరేశ్, నర్మద దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు నవదీప్ (8), మూడు నెలల బాబు ఉన్నాడు. కుటుంబాన్ని పోషించుకునేందుకు నరేశ్ ఆర్నెళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. నర్మద డెలివరీ అయినప్పటి నుంచి బుగ్గారం మండలం వెల్గొండలోని పుట్టింట్లో ఉంటోంది. పెద్ద కుమారుడు నవదీప్ (8) నేరెళ్లలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండోతరగతి చదువుతున్నాడు. రెండు నెలలుగా వెల్గొండ నుంచే పాఠశాలకు వచ్చిపోతున్నాడు. వారంరోజులుగా నవదీప్ జ్వరంతో బాధపడుతున్నాడు. చిన్నపాటి జ్వరమని భావించిన తల్లి నర్మద ఆస్పత్రికి తీసుకెళ్లి మందులు తెచ్చి వేస్తోంది. కొద్దిరోజులుగా పాఠశాలకు వెళ్లకుండా స్నేహితులతో కలిసి ఆడుకుంటూ ఉంటున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం స్నేహితులతో ఆడుకుంటుండగా కింద పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు బాలుడిని ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. బాలుడి శవాన్ని సోమవారం నేరెళ్లకు తీసుకొచ్చారు.

పుట్టెడు దుఃఖంతో ఇంటికి..

కొడుకు మరణవార్త తెలుసుకున్న తండ్రి నరేశ్ దుబాయ్ నుంచి సోమవారం స్వగ్రామానికి చేరాడు. కొడుకు విగతజీవిగా మారడంతో గుండెలవిసేలా రోధించాడు. ప్రతిరోజూ ఫోన్లో ముద్దుముద్దుగా మాట్లాడేటోనివి.. ఇప్పుడు ఎవరితో మాట్లాడాలి బిడ్డా.. అంటూ తల్లిదండ్రులు రోధించిన తీరు స్థానికులను కలచివేసింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: భోజన్నపేట గ్రామానికిచెందిన కాల్వ సతీశ్ (35) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాకు యత్నించాడు. ఈక్రమంలో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించాడని ఎస్సై మహేందర్ తెలిపారు. తమ ఇంట్లో జరిగిన ఓ ఫంక్షన్‌లో అతిగా మద్యం తాగిన విషయమై భార్య మందలించడంతో ఈనెల 16న సతీశ్ క్రిమిసంహారక మందు తాగాడు. స్థానికులు పెద్దపల్లిలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మరణించాడని ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

సీతంపల్లిలో..



పోశాలు (ఫైల్)

ముత్తారం(మంథని): సీతంపల్లికి చెందిన లింగం పోశాలు(58) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోశాలు మద్యం మత్తులో ఈనెల 16న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడి కొడుకు నరేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధూసూదన్‌రావు తెలిపారు.

జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

కరీంనగర్‌రూరల్: ఢిల్లీలో ఈనెల 25 నుంచి జరగనున్న జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సుహర్ష్ సాయి, ఎల్లా అవనిరెడ్డి ఎంపికయ్యారు. జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జీఎస్ అకాడమీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో సుహర్ష్ సాయి కాంస్య పతకం, ఎల్లా అవనిరెడ్డి రెండు కాంస్య పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. సోమవారం స్కూల్ చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్, కోచ్ సురేందర్‌సింగ్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి శ్రీకాంత్ అభినందించారు.

రాజన్నకు జనజాతర

వేములవాడ: రాజన్నను సోమవారం 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణ భక్తుల రద్దీతో కిటకిటలాడింది. చలి తీవ్రత పెరిగినప్పటికీ భక్తులు చలిలోనే వణుకుతూ ధర్మగుండంలో స్నానాలు చేశారు. రాజన్నకు కోడెమొక్కులు, తలనీలాలు సమర్పించుకున్నారు. బద్దిపోచమ్మకు బోనం మొక్కులు, భీమన్నగుడి ఇతర అనుబంధ దేవాలయాలను సందర్శించుకున్నారు.

రాజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే రమణారెడ్డి

కామారెడ్డి ఎమ్మెల్యే కే.వెంకటరమణారెడ్డి దంపతులు రాజన్నను దర్శించుకున్నారు. అధికారులు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. దర్శనానంతరం ఆలయ పర్యవేక్షకులు ఎడ్ల శివసాయి ప్రసాదాలు అందించారు.





బొగ్గు బాయి వార్తలు

ఫిరాయింపుదారులను పక్కనపెట్టాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: యూనియన్ ఫిరాయింపుదారులను పక్కనబెట్టాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. సోమవారం జీడీకే–1గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి ఉన్నంతకాలం ఏఐటీయూసీ సజీవంగా ఉంటుందన్నారు. అనేక పోరాటాల ద్వారా ఒప్పందాలు చేసుకున్నామన్నారు. బొగ్గు తీసే స్థలాల్లో పర్మినెంట్ కార్మికులను వినియోగించాలని ఒప్పందం చేశామన్నారు. వారసత్వ ఉద్యోగాల పేరును కారుణ్య నియామకాలనే ముద్దు పేరుపెట్టి కాసుల దందా చేసిన టీబీజీకేఎస్.. బీఆర్ఎస్ ప్రభుత్వం పడిపోగానే కనుమరుగయ్యే స్థితికి వచ్చిందని ఎద్దేవా చేశారు. ఇప్పుడు మరోఅధికార పార్టీ అనుబంధంగా ఉన్న యూనియన్‌లోకి వలసలు మొదలయ్యాయని తెలిపారు. ఇలాంటి ఫిరాయింపుదారులను కార్మికులు దగ్గరికి రానీయవద్దన్నారు. సమావేశంలో నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, రంగు శ్రీనివాస్, సంకె అశోక్, బోగ సతీశ్‌బాబు, గండి ప్రసాద్, కన్నం లక్ష్మీనారాయణ, మహేందర్, మానాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో రాజకీయ జోక్యం అరికడతాం

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో రాజకీయ జోక్యం అరికడతామని, కార్మికుల హక్కుల సాధనకు అహర్నిశలు కృషి చేస్తామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. సోమవారం యూనియన్ కార్యాలయం వద్ద ప్రచార వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ బొగ్గుగని కార్మికుల సీఎంపీఎఫ్‌ను భద్రంగా కాపాడుతున్న బీఎంఎస్‌ను ఆదరించాలన్నారు. కొత్త భూగర్భగనుల తవ్వకం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. సొంతింటి పథకం అమలు చేయడానికి కృషి చేస్తామని అన్నారు. రక్షణ విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసి మరింత పటిష్టపర్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సింగరేణి పరిశ్రమకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్మికులకు ఇన్‌కంట్యాక్స్ రీయంబర్స్‌మెంట్ చేయించడానికి, కేంద్రీయ విద్యాలయాలు నెలకొల్పేలా చూస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల హరిణ్, సాయవేణి సతీశ్, మాదాసు రవీందర్, పల్లె శ్రీనివాస్, సంగాని సాంబయ్య, ఎల్లావుల కోటయ్య, బోడకుంట రాజేశం, నీలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

27న 'గుర్తింపు' ఎన్నికలు జరగాల్సిందే..

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను ఈనెల 27న నిర్వహించాల్సిందేనని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే మూడుసార్లు ఎన్నికలు వాయిదాపడ్డాయని, ఈసారి బ్యాలెట్ ముద్రణ కూడా పూర్తయ్యిందన్నారు. ఐఎన్‌టీయూసీ వాయిదావేయాలని చూస్తోందని కొన్ని యూనియన్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికలకు సంబంధించి డిప్యూటీ ఆర్ఎల్‌సీ నిర్వహించిన అన్ని సమావేశాలకు తమ యూనియన్ హాజరైందని గుర్తుచేశారు. తమ యూనియన్ పూర్తిస్థాయి పటిష్టంగా ఉందని, 6వేల మంది ఇతర యూనియన్ల నుంచి ఐఎన్‌టీయూసీలో చేరారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌తో అంటకాగిన ఏఐటీయూసీకి తమను విమర్శించే అర్హత లేదని పేర్కొన్నారు. నిజాయితీ, చిత్తశుద్ధి ఉంటే మునుగోడు ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చిన సీపీఐ.. అప్పుడు గుర్తింపు ఎన్నికలకు ఎందుకు డిమాండ్ చేయలేదని ప్రశ్నించారు. నాయకులు ధర్మపురి, సదానందం, శ్రీనివాస్, జగన్‌మోహన్, సత్యనారాయణరెడ్డి, నీరటి సాగర్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే టీబీజీకేఎస్ ధ్యేయం

రామగిరి(మంథని): కార్మికుల సంక్షేమమే తమ యూనియన్ ధ్యేయమని టీబీజీకేఎస్ జనరల్ సెక్రటరీ మిర్యాల రాజిరెడ్డి అన్నారు. సోమవారం ఆర్జీ–3 పరిధి ఓసీపీ–2లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికుల హక్కుల సాధనకు కృషి చేశామన్నారు. ముఖ్యంగా కారుణ్య నియామకాలు, క్వార్టర్లలో ఏసీ కల్పన, ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే రూ.20లక్షల మ్యాచింగ్ గ్రాంట్, సంక్షేమ పథకాల అమలు తమతోనే సాధ్యమన్నారు. ఈ ఎన్నికల్లో కార్మికులు బాణం గుర్తుకుఓటు వేసి ఆదరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, నాయకులు వేముల రవిశంకర్, నాగెల్లి సాంబయ్య, పర్శ బక్కయ్య, దేవ శ్రీనివాస్, ఎండీ రహీమొద్దీన్ పాల్గొన్నారు.

ఎన్నికల వాయిదా కుట్రలను తిప్పి కొట్టండి

గోదావరిఖని: గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల వాయిదా కుట్రలను తిప్పి కొట్టాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ కోరారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో ఎన్నికల ప్రక్రియ అనేక కారణాలతో వాయిదా పడుతూ వస్తోందని, చివరికి డిసెంబర్ 27వ తేదీన ఎన్నికలు నిర్వహించడానికి సింగరేణి యాజమాన్యం, కార్మిక శాఖ పూర్తిసన్నాహాలు చేశాయని తెలిపారు. అయితే, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎనర్జీ సెక్రటరీ హైకోర్టును ఆశ్రయించి ఎన్నికల వాయిదాకు ప్రయత్నం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈనెల 27న ఎన్నికలు యథావిధిగా నిర్వహించడానికి ప్రభుత్వం అనుమతించాలని, కోర్టులో ఉన్న కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు నరేశ్, బాబు, మొండయ్య, యూసుఫ్, శంకర్, సాంబయ్య, రవికుమార్, సంతోష్, మల్లేశ్, మహేందర్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాచండీయాగం



పూజలో నరేందర్‌రెడ్డి దంపతులు

రామడుగు: దేశ్‌రాజ్‌పల్లి అల్ఫోర్స్ ప్రాంగణంలో మహారుద్ర సహిత సహస్ర చండీ మహాయాగం అత్యంత వైభవంగా కొనసాగుతోంది. వేడుకల్లో భాగంగా రెండోరోజు సోమవారం గణపతిపూజ, గురుపూజతో కార్యక్రమం ప్రారంభించారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి, డాక్టర్ వి.వనజారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య సాగిన మహాయాగంతో అల్ఫోర్స్ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణతో పాటు మహాప్రసాదం అందజేశారు. వివిధ పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై సీఐటీయూ పోరాటం

- యూనియన్ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని: కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. సోమవారం ఆర్జీ–1 సీఎస్పీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో గెలిచిన కార్మిక సంఘాలన్నీ కార్మికులకు ద్రోహం చేశాయని విమర్శించారు. తమది పెద్ద సంఘం అని చెప్పుకుంటున్న ఏఐటీయూసీ.. కార్మికుల హక్కులను హరిస్తోందని దుయ్యబట్టారు. మైనింగ్ టెక్నీషియన్లు, ఆపరేటర్ల హక్కులను వన్ టైం సెటిల్మెంట్‌తో అగ్రిమెంట్లు చేసి హక్కులన్నీ యాజమాన్యానికి తాకట్టు పెట్టిందన్నారు. ఈసందర్భంగా పలువురు యూనియన్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, మేదరి సారయ్య, మెండె శ్రీనివాస్, సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, ఆసరి మహేశ్, ఆరెపల్లి రాజమౌళి, గౌస్, దాసరి సురేశ్, తుమ్మల కృష్ణారెడ్డి, బూరుగుల రాములు తదితరులు పాల్గొన్నారు.

నాగారంలో ఇల్లు దగ్ధం

మంథని: నాగారంలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చింతల కొమురక్క ఇల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కొంత నగదు, నిత్యావసర సరుకులు, వెండి, జీవిత బీమా పత్రాలు కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. మంటలు అదుపులోకి తేవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయ్యింది.